నేడు బీఆర్ఎస్ భేటీ

పరిగి, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సిద్ధం చేసి, వారిని ఎన్నికల రంగంలోకి మరింత ఉత్సాహంగా పంపించేందుకుగాను బీఆర్ఎస్ పార్టీ శనివారం పరిగిలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నది. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అధ్యక్షతన పరిగిలోని ఎస్ గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్ పార్టీ పరిగి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, టి.ప్రకాశ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంటు స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ హాజరు కానున్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ పార్టీ గ్రామ, మండలాల కమిటీల నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి కోరారు.

కలప అక్రమ రవాణాను అరికడుతాం

పరిగి, మార్చి 22: కలప అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికడతామని అటవీ శాఖ పరిగి రేంజ్ ఆఫీసర్ అబ్దుల్ హాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిగి రేంజ్ పరిధిలో ఎక్కడ అక్రమ కలప రవాణా జరుగుతున్నా తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా ఆయన సూచించారు. చెట్ల నరికివేత వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని, పచ్చదనం తగ్గుతుందన్నారు. అక్రమంగా చెట్ల నరికివేత చట్ట విరుద్ధమన్నారు. పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, కలప అక్రమ రవాణాను అరికట్టేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ కట్టడాలను కూల్చివేస్తాం

తాండూరు డీఎల్పీవో శంకర్ నాయక్ హెచ్చరిక

పెద్దేముల్, మార్చి 22 : అక్రమ కట్టడాలను నిర్మిస్తే కూల్చివేస్తామని తాండూరు డీఎల్పీవో శంకర్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఓ అక్రమ కట్టడాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వన నర్సరీ, పల్లె ప్రకృతి వనం, నీటి తొట్టెలను, హ్యాండ్ పంపులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా అనుమతులు తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే నోటీసుల జారీ చేసి కూల్చివేస్తామని హెచ్చరించారు. ఖానాపూర్‌లో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టగా రెండు నోటీసులు జారీ చేసినా బేఖాతరు చేయడంతో గ్రామ పంచాయతీ అనుమతి పొందాలని సూచించారు. అనంతరం వన నర్సరీని పరిశీలించారు. వేసవి దృష్ట్యా నీటితొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, హ్యాండ్ పంపులు పాడయితే వాటిని గుర్తించి వెంటనే రిపేరు చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి యశ్వంతు ఉన్నారు.

ఖానాపూర్‌లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో శంకర్ నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మాధురి

నీటి ప్రాముఖ్యతపై అవగాహన

కులకచర్ల, మార్చి 22 : ప్రతి ఒక్కరూ నీటి ప్రాముఖ్యతను తెలుసుకొని వృథాను అరికట్టాలని కులకచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ నీటి విలువను తెలియజేయాలన్నారు. జనాభా పెరుగుదలను అనుగుణంగా నీటి వనరులపై ఒత్తిడి పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ స్వరూపరాణి, సూపర్ వైజర్ విజయలక్ష్మి, యాదమ్మ, ఏఎన్ఎం జంగమ్మ, ఆశాకార్యకర్తలు సునీత, లావణ్య, స్వరూప, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

పూడూరు, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని పరిగి సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూడూరు మండలం మన్నెగూడ, పూడూరు, కంకల్, మంచన్‌పల్లి, చన్గోముల్ గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడే వ్యక్తులపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చన్గోముల్ స్టేషన్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

బషీరాబాద్, మార్చి 22 : ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించాలని బషీరాబాద్ తహసీల్దార్ వై. వెంకటేశ్ అన్నారు. శుక్రవారం జలాల్‌పూర్, నీళ్లపల్లి, పర్వత్‌పల్లి, మాసన్‌పల్లి, కోర్విచేడ్, తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయలంలో బీఎల్‌వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లు ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని, ఓటు ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. 85 సంవత్సరాలు పైబడినవారికి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందని, ఈ విషయాన్ని ప్రజలుకు తెలియజేసి ఫారాలను అందించాలని తెలిపారు.

పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన కడా ప్రత్యేకాధికారి

కొడంగల్, మార్చి 22: ఈ నెల 28వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు గాను పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి పోలింగ్ కేంద్రంలోని ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, తహసీల్దార్ విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి, ఏఆర్ఐ శ్రుతి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో 50 ఏండ్ల తర్వాత..

అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్

వివరాలు వెల్లడిస్తున్న జేకేఏఐ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సెన్సాయి రాపోలు సుదర్శన్

మణికొండ, మార్చి 22 : జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(జేకేఏఐ) అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్-2025కు హైదరాబాద్ మహానగరం అతిథ్యం ఇవ్వనున్నదని జేకేఏఐ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సెన్సాయి రాపోలు సుదర్శన్ తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ ఖానాపూర్‌లోని డుజో కరాటే శిక్షణ క్యాంపస్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో అంతర్జాతీయ టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత భారతదేశంలోని హైదరాబాద్‌లో తొలిసారిగా అంతర్జాతీయ టోర్నమెంట్ జరుగుతుందని చెప్పారు. ఈ పోటీలకు ప్రపంచ వ్యాప్తంగా 3వేల మందికి పైగా కరాటే యోధులు పాల్గొంటారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 18 నుంచి 22 వరకు నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 'అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్-2025' అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టామన్నారు. 17వ ఆల్ ఇండియా జేకేఏఐ క్యూ లెవల్ కరాటే, 12వ ససాకి, షోయిచి, మెమోరియల్ సీనియర్స్ నేషనల్ కరాటే పోటీలు జరుగుతాయన్నారు. కటా(ఫారం), కుమిటే(స్పారింగ్) భాగస్వామ్యానికి ఎంపికలు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర జేకేఏఐ నూతన చీఫ్ ఇన్‌స్ట్రక్టర్‌గా సెన్సాయి దయానంద్ కుమార్‌ను నియమిస్తున్నట్లు రాపోలు సుదర్శన్ ప్రకటించారు. వచ్చే ఏడాది జరిగే అంతర్జాతీయ పోటీలకు దయానంద్ ప్రధానకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జేకేఏఐ డైరెక్టర్లు శ్రీనివాసచారి, ధన్‌రాజ్, విష్ణువర్ధన్, శ్రీకాంత్, చెన్నయ్య, చందర్, నాగరాజ్, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులే లక్ష్యంగా..

మత్తు ఆయిల్ విక్రయాలు

రూ.3.36లక్షల విలువజేసే..

672ఎం.ఎల్ హషీష్ ఆయిల్ పట్టివేత

ఆటోడ్రైవర్‌ను అరెస్టు చేసిన ఎస్‌వోటీ పోలీసులు

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సూరారం ప్రాంతానికి చెందిన జీవన్ ఆటోడ్రైవర్. వ్యసనాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి, హషీష్ ఆయిల్ వంటి మత్తు పదార్థాలు విక్రయించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట అరకు నుంచి పెద్ద మొత్తంలో హషీష్ ఆయిల్ (గంజాయి నుంచి తీసిన నూనె)నున నగరానికి తీసుకువచ్చాడు. ఈ మత్తు ఆయిల్‌ను చిన్న చిన్న ప్లాస్టిక్ డబ్బాల్లో ప్యాక్ చేసి, కళాశాలల వద్ద విద్యార్థులకు, లేబర్ అడ్డాల వద్ద కార్మికులకు విక్రయించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నాడు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌వోటీ బృందం.. శుక్రవారం జీవన్ ఆటోను తనిఖీ చేయగా రూ. 3.36 లక్షల విలువజేసే 672ఎం.ఎల్‌ల హషీష్ ఆయిల్ బయటపడింది. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి, ఆటోతో సహా హషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును సూరారం పోలీసులకు అప్పగించారు.

కులకచర్ల, మార్చి 22 : చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో రేణుకాచార్య జయంత్యుత్సవాన్ని శుక్రవారం మందిపల్ ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరశైవ మతస్థాపకులు రేణుకాచార్యులని ఓంకారేశ్వర స్వామి దేవాలయ అర్చకులు మఠం రాజశేఖర్ అన్నారు. కార్యక్రమంలో మందిపల్ గ్రామానికి చెందిన వీరశైవులు పాల్గొన్నారు.

లాజిస్టిక్స్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి

ఐఎఫ్ఎస్, డాక్టర్ విష్ణువర్ధన్

మాదాపూర్, మార్చి 22 : లాజిస్టిక్స్ అనేది ప్రపంచ వాణిజ్యానికి జీవనాధారమని ఐఎఫ్ఎస్, డాక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం ఏర్పాటు చేసిన షిప్పింగ్, లాజిస్టిక్స్‌పై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఐఎఫ్ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డి విచ్చేసి షిప్పింగ్, లాజిస్టిక్స్ కమిటీ చైర్మన్ కమల్ జైన్, ఎస్ఎంఈ జాయింట్ సెక్రటరీ మెర్సీ ఇపావో, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రదీప్ పనికర్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ స్వరూప్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాజిస్టిక్స్ ధరను 9శాతం తగ్గించడంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డు ఉండటం వల్ల భారీ ప్రయోజనం చేకూరనున్నట్లు తెలిపారు.

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐఎఫ్ఎస్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

ఎన్నికల కోడ్..వాల్‌పోస్టర్ల తొలగింపు

పెద్దేముల్, మార్చి 22 : మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వాల్ పెయింటింగ్స్, వాల్ పోస్టర్లు చెరిపివేయిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారిలో ఉన్న స్తంభాలకు పోస్టర్లను తొలగించి వాటిని సున్నంతో గ్రామ పంచాయతీ సిబ్బంది చెరిపివేశారు.

హవాలా నగదు పట్టివేత

సీజ్ చేసిన నగదును మీడియాకు చూపిస్తున్న మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు

చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన నగదుతో పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్‌లో తనిఖీలు..

మలక్‌పేట, మార్చి 22: మలక్‌పేట పోలీసులు దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్ చౌక్‌వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.3.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగదు తరలిస్తున్న సాయిప్రసాద్‌ను విచారించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో నగదు సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

తనిఖీలు.. భారీగా నగదు పట్టివేత

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న రూ. 38,73,500 నగదు, 43.11 లీటర్ల లిక్కర్, రూ. 1,18,799 విలువైన వివిధ రకాల వస్తువులను సీజ్ చేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ప్పటి నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఇప్పటి వరకు రూ. 38 లక్షలు సీజ్ చేయగా, పోలీసులు రూ. 47,91,800 నగదుతో పాటు రూ. 19,06,089 విలువైన ఇతర వస్తువులను సీజ్ చేశారని వెల్లడించారు. ఇప్పటి రకు 34 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు రోనాల్డ్ రాస్ తెలిపారు.

.. పట్టుబడిన రూ.10 లక్షలు

మలక్‌పేట, మార్చి 22: మలక్‌పేట పోలీసులు మూసారాంబాగ్ ఎస్‌బీఐ కాలనీ పార్కువద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా కారు డిక్కీలో తీసుకెళ్తున్న రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం పదిన్నర సమయంలో మలక్‌పేట, ఎఫ్ఎస్‌టీ-1సీ పోలీసులు సంయుక్తంగా ఎస్‌బీఐ కాలనీ పార్కువద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ఇంజపూర్ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సాయిచరణ్(33) కారులో వెళ్తుండగా.. పోలీసులు ఆపి తనిఖీ చేశారు. కారు డిక్కీలోరూ.10 లక్షలు లభించాయి.

చాదర్‌ఘాట్‌లో రూ.49 లక్షలు పట్టివేత

చాదర్‌ఘాట్, మార్చి 22: నిబంధనలకు విరుద్ధంగా వాహనంలో తరలిస్తున్న రూ.49లక్షల నగదును ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నగదును తరలిస్తున్న ఇద్దరిని విచారణ నిమిత్తం చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. చాదర్‌ఘాట్ పోలీసుల కథనం ప్రకారం... చాదర్‌ఘాట్ పోలీసులు, ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టారు. కాచిగూడ వైపు వెళ్తన్న ఓ కారును తనిఖీ చేయగా.. రూ.49లక్షల నగదు పట్టుబడింది. ఎలాంటి పత్రాలు లేకుండా రవి ప్రకాశ్ శర్మ, బొజ్జ సంజీవరావు నగదు తీసుకెళ్తున్నారని పోలీసులు తెలిపారు. సీజ్ చేసిన నగదును ఐటీ శాఖ అధికారులకు అప్పగించనున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్ చౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ ఆంజనేయులు, ఎస్ఐలు సీహెచ్. సురేశ్, బి.జయంత్, నవీన్

బేగంబజార్‌లో..

సుల్తాన్‌బజార్,మార్చి 22: బేగంబజార్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 31 లక్షలు పట్టుబడ్డాయి. నగదు తరలిస్తున్న హీరాలాల్ బిష్ణోయ్, ఆమ్రా రామ్ సావరామ్ దేవసీ, హనుమాన్ రామ్‌ను విచారించారు. హవాలా నగదుగా గుర్తించారు. ఈ నగదులను ఐటీ శాఖకు అప్పగిస్తామని బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

రూ.17.40 లక్షల హవాలా డబ్బు సీజ్.. ఇద్దరి అరెస్టు

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా హవాలా పద్ధతిలో డబ్బులు తరలిస్తున్న ఇద్దరిని రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి ఆదిత్య గెహ్లోట్, రోహిత్ కలిసి అనుమానాస్పద స్థితిలో ద్విచక్ర వాహనంపై మైలార్‌దేవ్‌పల్లి లబ్బాయ్ కాంటా మీదుగా వెళ్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్ఓటీ బృందం నిందితులను ఆపి, తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారి వద్ద రూ.17,40,100 నగదు లభించింది. నగదును హవాలా ద్వారా తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కందుకూరు, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, గుంతకోడూరు గ్రామానికి చెందిన తూంకుంట శంకర్ (27) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇక్కడ ఓ యువతిని ప్రేమించాడు. వీరి ప్రేమ వ్యవహారాన్ని తల్లిదండ్రులతో చెప్పాడు. ఆ యువతితో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుందామంటూ.. తల్లిదండ్రులు చెప్పారు. దీంతో అతడు గురువారం వరుసకు సోదరైన మహిళను, ప్రేమించిన యువతిని సంతోష్‌నగర్‌లో బస్సు ఎక్కించి.. అతడి గ్రామానికి పంపించాడు. అతడు ద్విచక్ర వాహనంపై గ్రామానికి బయలుదేరాడు. అయితే, శంకర్ దెబ్బడగూడ గేటు సమీపంలో వెళ్తుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి వెళ్లి.. గాయపడిన శంకర్‌ను చికిత్స నమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మరణించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

ఏసీబీ కస్టడీకి పశుసంవర్ధక శాఖ అధికారులు

నాంపల్లి కోర్టులు, మార్చి 22 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ పథకం కేసులో పశుసంవర్ధక శాఖ అధికారి అంజిలప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ డా.పి.క్రిష్ణయ్యను ఐదు రోజుల పోలీసుల కస్టడీకి అప్పగిస్తూ ఏసీబీ కోర్టు జడ్జి మహ్మద్ అఫ్రోజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని శనివారం ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకోనున్నారు. వీరిద్దరి నుంచి సేకరించిన సమాచారంతో ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొంత మందిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు.

మద్యం తాగిన వాహనదారులకు జైలు శిక్ష

కాచిగూడ,మార్చి 22: మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు కోర్టు జైలు శిక్ష విధించింది. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇటీవల కాచిగూడ, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందిపై కేసులు నమోదు చేశారు. బుధవారం, శుక్రవారం నాంపల్లి 7 ఎంఎం కోర్టులో వీరందరినీ హాజరుపర్చగా..ముగ్గురికి 2 రోజులు, 12 మందికి 4 రోజులు, ఒకరికి 22 రోజుల జైలు శిక్షను శుక్రవారం న్యాయస్థానం విధించింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాగుడుకు బానిసై తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని వాహనాలను నడపాలన్నారు.